# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్వేతపత్రం విడుదల చేశారు.
- లోక్‌సభలో నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల అవకతవకలపై ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టడంతో సభను ఓం బిర్లా సోమవారానికి వాయిదా వేశారు.
- రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి పేర్కొన్నారు.
- పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో, రాష్ట్రం లో రానున్న రెండు రోజులలో వర్షాలు కురిసే అవకాసం వుందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.

==========================

పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్వేతపత్రం విడుదల చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించిన పురోగతిని రాష్ట్ర ప్రజలకు తెలిపేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామన్నారు. మొత్తం ఏడు శ్వేతపత్రాలు విడుదల చేయబోతున్నామని, పోలవరంపై మొదటి శ్వేతపత్రం విడుదల చేశామని సాగునీటి ప్రాజెక్టులపై రెండవ శ్వేతపత్రం ఇస్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి జీవనాడి పోలవరమని నదుల అనుసంధానానికి గుండెలాంటిదన్నారు. వృధాగా సముద్రం లో కలిసే 3వేల టీఎంసీల వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని కరవు రహిత రాష్ట్రం గా మార్చే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి జలవిద్యుత్ కీలకమని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం వస్తుందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

===========================

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల అంశంపై పార్లమెంటు ఉభయసభల్లో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. దీంతో లోక్‌సభను సభాపతి ఓం బిర్లా సోమవారానికి వాయిదావేశారు. ఈరోజు ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభాపతి ఓం బిర్లా విపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో విపక్ష సభ్యులు తమ స్థానాల నుంచి లేచి, నీట్‌పై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. సభాపతి చర్చకు అంగీకరించకపోవటం వల్ల విపక్ష సభ్యుల నినాదాలతో గందరగోళం నెలకొనడంతో ఓం బిర్లా సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సమావేశమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవటం వల్ల సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇక రాజ్యసభలోనూ అదే పరిస్థితి కొనసాగింది. నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై పార్లమెంట్‌లో గౌరవప్రదంగా చర్చ జరిగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కోరారు.

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులో మాట" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది.

===========================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో, ఉత్తర ఒడిశా తీరంలో వాయువ్య బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడింది. దాని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ వరకు విస్తరించి ఉంది. రానున్న 2 రోజుల్లో ఇది వాయువ్య దిశగా కదలే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు.

===========================

మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నివాళులర్పించారు. విప్లవాత్మక సంస్కరణలు, సాహసోపేతమైన నిర్ణయాలతో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు తెలుగు వెలుగు పీవీ నరసింహారావు పునాదులు వేశారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలికి నివాళులర్పిస్తున్నట్టు సామాజిక వేదికగా చంద్రబాబు నాయుడు తెలిపారు.

విరామం

===========================

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. ఈరోజు సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ నీటిని ఖరీఫ్ పంటకు మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా శివారు భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలుచేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపర భగీరధుడని, తోటపల్లి ప్రాజెక్ట్ ను ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలను సస్యశ్యామలం చేశారని తెలిపారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల పెండింగ్ పనులు, పూర్ణపాడు-లాబేసు వంతెనల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రైతులు రెండు పంటలు పండించుకోవచ్చని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

===========================

విశాఖపట్నా నికి చెందిన గోల్ఫ్ క్రీడాకారిణి బి. కేయ కుమార్ ఈ రోజు` ఇండోనేసిషియా బాలిలో జరిగిన 2వ అంతర్జాతీయ జూనియర్ గోల్ఫ్ చాయంపియన్ షిప్ లోవిజేతగా నిలిచింది. ఈ విజయంతో కేయకుమార్ ప్రపంచ ర్యాంకింగ్ లో స్థానం సంపాదించింది. గోల్ఫ్ క్రీడలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచనెందుకు గాను కేయ కుమార్ అత్యంత పతిష్ఠాత్మకమైన ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ నిర్వ హించే స్ట్రయివ్ ఫర్ ఎక్సెన్స్ కార్యక్రమానికి గత రెండు సంవత్సరాలుగా ఎంపికవుతోంది.

==========================

రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈరోజు కాకినాడ జిల్లాలో పర్యటించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు రాష్ట్ర పౌరసరఫరాల ఎండీ వీరపాండ్యన్, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి , కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయం, రెవిన్యూ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రేషన్ సరఫరాపై సమీక్షించారు. బియ్యం అక్రమ రవాణా అధికంగా జరుగుతోందని దానిని అరికట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. కాకినాడలో వ్యవస్థీకృత బియ్యం మాఫియా నడుస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేయని అధికారులపై కఠిన చర్యలుంటాయని మంత్రి హెచ్చరించారు.

==========================

డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జులై 1 నుండి 31వ తేదీ వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ నిర్వహణ విధి విధానాలపై కలెక్టరేట్ లో లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఈరోజు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుతుపవనాల ఆగమన సమయంలో డెంగ్యూ వ్యాధి ప్రబలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ వ్యాధి నియంత్రణకు సమన్వయ కమిటీ అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. డెంగ్యూ ఇతర కీటక వ్యాధుల నియంత్రణ నివారణ చర్యల పై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

==========================

క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాంతకం కాదని శ్రీకాకుళం రిమ్స్ వైద్యులు డాక్టర్ సత్య స్వరూప్ అన్నారు. శ్రీకాకుళంలోని చైల్డ్ హుడ్ క్యాన్సర్ పై ఈరోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్య స్వరూప్ మాట్లాడుతూ గుండెపోటు తర్వాత ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణవుతున్న మహమ్మారి క్యాన్సర్ అన్నారు. ఔషధాలు, చికిత్స ఉన్నప్పటికీ, సకాలంలో గుర్తించకపోతే క్యాన్సర్ ప్రాణాంతకమవుతుందని చెప్పారు. విడువని దగ్గు, పేగుల కదలికల్లో మార్పులు, గడ్డలు, వాపులు, పుట్టుమచ్చల్లో మార్పులు, కారణం లేకుండా బరువు తగ్గడం, తగ్గని నొప్పులు, ఆహారం మింగడానికి ఇబ్బంది పడడం, మూత్రంలో రక్తం పడడం తదితర లక్షణాలు క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారిలో కనిపిస్తాయన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు కూడా క్యాన్సర్ వ్యాధికి కారణం అవుతున్నయన్నారు. చిన్నారులు ఇంట్లో వండిన ఆహార పదార్థాలను తీసుకోవాలని డాక్టర్ సత్య స్వరూప్ సూచించారు.

==========================
==========================